
సాక్షి ఒడిశా

మంగళవారం । 5 । సెప్టెంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,40,872లు, బంగారం 700 మిల్లీగ్రాములు, వెండి 14 గ్రాముల 1500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



విన్నపాలు వినవలె..!

రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌కు వినతులు వెల్లువెత్తుతున్నాయి. తమ సమస్యలు తెలుపుకునేందుకు ప్రజలు బారులుతీరుతున్నారు.

- IIలో



సమస్యలు పరిష్కరిస్తాం

అలేఖ్ బాబా ఆశ్రమాల్లో సాదు జీవితం గడుపుతున్న వారి సమస్యలు పరిష్కరిస్తామని జొరిగాం ఎమ్మెల్యే ప్రకాష్ చంద్ర మజ్జి ప్రకటించారు.

- IIలో

న్యూస్‌రీల్

ఖురిగా పాఠశాలలో చోరీ



తెరిచివున్న పాఠశాల తలుపులు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి ఖురిగా గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. పాఠశాల తరగది తలుపులు విరగ్గొట్టిన దుండగులు క్రీడా సామగ్రి, వంట సామగ్రి తదితర వస్తువులు దొంగలించినట్లు గ్రామస్తులు టికిరి పోలీసుస్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో పశువులు సైతం నిరంతరం ప్రవేశిస్తున్నాయని, వస్తువులకు భద్రత కరువయ్యిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగు పడి 17 మేకలు మృతి



మృతి చెందిన మేకలు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పంచాయతీ సెమిలిగుడ గ్రామ సమీపంలోని అడవిలో మేతకు వెళ్లిన 17 మేకలు పిడుగు పాటుకు గురై మృతి చెందాయి. ఆదివారం సాయంత్రం చోటుచేసుకున్న ఈ ఘటనలో మేకలు కోల్పోయిన సంహాచల్ మాఝి, లోచన్ మాఝి, మహేశ్వర్ మాఝిలు లబోదిబోమంటున్నారు. మేకలను మేతకు తీసుకెళ్లి వస్తుండగా అదే సమయంలో వర్షం కురిసింది. దీంతో మేకలన్నీ ఒక చెట్టు కింద ఉన్నాయి. అదే సమయంలో పిడుగు పడటంతో మేకలన్నీ మృత్యువాత పడ్డాయి. విషయం తెలుసుకున్న బాధితులు టికిరి రెవెన్యూ అధికారిని కలిసి, తమకు ప్రభుత్వం తరుపున నష్ట పరిహారం ఇప్పించాలని కోరారు.

చెట్టును ఢీకొన్న ట్యాంకర్

● డ్రైవర్‌కు గాయాలు



చెట్టును ఢీకొనడంతో దెబ్బతిన్న ట్యాంకర్

రాయగడ: ఝూర్సుగుడ నుంచి లంజిగడ్ వైపు వస్తున్న ఒక ట్యాంకర్ అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ఘటన జిల్లాలోని అంబాదల పోలీసుస్టేషన్ పరిధి కెందుమోర కూడలిలో ఆదివారం చోటుచేసుకుంది. ఐఐసీ కార్తీక్ నాయక్ తెలిపిన వివరాల మేరకు.. ఝూర్సుగుడ నుంచి పౌడర్ లోడ్‌తో ట్యాంకర్ లంజిగడ్‌లోని వేదాంత కంపెనీకి వెళ్తోంది. ఈ క్రమంలో కెందుమోర కూడలి వద్దకు చేరుకునేసరికి అదుపు తప్పి పక్కనే ఉన్న చెట్టును బలంగా ఢీకొంది. దీంతో ట్యాంకర్ నుజ్జునుజ్జయ్యింది. ట్యాంకర్ డ్రైవర్‌కు తీవ్రగాయాలవ్వడంతో అంబులెన్స్ సాయంతో మునిగుడ పీహెచ్‌సీకి చికిత్స నిమిత్తం తరలించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ రమేష్ మాఝి

మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి సమితిలో ఉన్న తండ్కి, ఛలాన్‌గూడ, తండపల్లి, గోరాఖోంట, గౌడిగూడ పంచాయతీల్లో పలు అభివృద్ధి పనులకు ఎంపీ రమేష్ మాఝి సోమవారం శంకుస్థాపన చేశారు. రూ.10 లక్షల ఎంపీ లాండ్స్ నిధులతో ఆయా పంచాయతీల్లో నూతన ఆలయాలకు శ్రీకారం, ఆలయాల మరమ్మతులు చేయడానికి చర్యలు తీసుకున్నారు. గౌడిగూడ పంచాయతీలో ఎంవీ 10 గ్రామం వద్ద రాధాకృష్ణ మందిరం అభివృద్ధి కోసం రూ.2 లక్షలు మంజూరు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మానిస్ మడ్కమి, సర్పంచ్‌లు, బీజేడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్ద మనసు

● ఉపాధ్యాయురాలి దాతృత్వం
● కూతురు పేరిట దాచుకున్న డబ్బులు రెడ్‌క్రాస్‌కు విరాళం



కలెక్టర్ కమలోచన్ మిశ్రాకు చెక్కు అందజేస్తున్న రష్మితా శెఠి

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ సెల్ నడుస్తోంది. వేదిక మీదకు ఒక్కొక్కరూ వచ్చి తమ సమస్యలను కలెక్టర్ డాక్టర్ కమలోచన్ మిశ్ర, ఎస్పీ ఎస్.సుశ్రీ, డీఆర్‌డీఏ పీడీ అన్యదాస్‌లకు వివరిస్తున్నారు. అధికారులు వెనువెంటనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. ఇదిలా కొనసాగుతుండగా.. అదే సమయంలో ఒక మహిళ చొరవగా వేదిక మీదకు వెళ్లి మైక్ అందుకున్నారు. వెంటనే కలెక్టర్ ఆమెను సమస్య ఏంటని ప్రశ్నించారు. ఆమె తనను తాను పరిచయం చేసుకున్నారు. నబరంగ్‌పూర్ జిల్లా పపడాహండి సమితిలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న రస్మితా శెఠి అన్నారు. అయితే గ్రీవెన్స్‌లో ప్రభుత్వ ఉద్యోగులు తమ వ్యక్తిగత సమస్యలు చెప్పడం నిషేధం. దీంతో అక్కడ ఉన్నవారిలో గుసగుసలు ప్రారంభమయ్యాయి. రస్మితాని కలెక్టర్ సస్పెండ్ చేస్తారని భావించారు. అయితే రస్మితా తన ప్రసంగం కొనసాగిస్తూ తన ఏకైక కుమార్తె సికిల్ సెల్ వ్యాధిలో ఇటీవలే చనిపోయిందని ఆమె చెప్పారు. ఆమె పేరిట తాను దాచుకున్న రు.5 లక్షలను రెడ్‌క్రాస్‌కి విరాళం ఇస్తున్నట్లు చెప్పి చెక్కును కలెక్టర్‌కు అందించారు. దీంతో ఒక్కసారిగా సభలో నిశ్శబ్దం ఏర్పడింది. ఆ డబ్బులను చిన్నారుల సంక్షేమం కోసం వినియెగించమని రస్మిత విజ్ఞప్తి చేశారు. తేరుకున్న కలెక్టర్‌తో సహా ఇతర అధికారులు ఆమెను చప్పట్లతో అభినందించారు.

పంచాయతీ కార్యాలయం ముట్టడి



పంచాయతీ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

● బీజేపీ కార్యకర్తల ఆందోళన



పంచాయతీ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

జయపురం: సబ్ డివిజన్ కుంద్రా సమితి దిగాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని బీజేపీ కార్యకర్తలు సోమవారం ముట్టడించారు. ఈ సందర్భంగా పంచాయితీ అధికారులకు వ్యతిరేక నినాదాలు చేశారు. అనంతరం రాష్ట్ర గవర్నర్‌ను ఉద్దేశించి 12 డిమాండ్లతో కూడిన వినతిపత్రం పంచాయతీ అధికారికి సమర్పించారు. వినతిపత్రంలో జిల్లా కలెక్టర్ నుంచి బీడీవో వరకు అధికారులంతా అధికార పార్టీ ఏజెంట్లుగా పనిచేస్తున్నారని ఆరోపించారు. ప్రతీ పథకం అధికార పార్టీకి చెందిన కార్యకర్తలకే చేరేలా పనులు చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజల కోసమే తాము పనిచేస్తున్నటుల్ అధికార పార్టీ నేతలు ప్రజలను మభ్యపెడుతున్నారని ధ్వజమెత్తారు. పింఛన్ల పంపిణీ, ఆవాస్ యోజన ఇళ్ల మంజూరు, ఉపాధి హామీ పథకం అమలు, సాధారణ పౌర సరఫరా దినుసుల పంపిణీలో జరుగుతున్న అవినీతి తారాస్థాయికి చేరుతున్నాయని ఆరోపించారు. టాటా విద్యుత్ కంపెనీ సభ్యులు విద్యుత్ చార్జీలు పెంచుతూ ప్రజలను దోచుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ తప్పుడు విధానాల వలన వందలాది మంది రైతులు కృషీ సమృద్ధి పథకంలో లబ్ధి పొందలేకపోతున్నారని ఆరోపించారు. రాష్ట్ర పాలకులు తమ స్వలాభం కోసం కేంద్ర ప్రభుత్వ ఆయుస్మాన్ యోజన పథకాన్ని ఒడిశాలో అమలు చేయడం లేదని, అందువలన అనేక మంది నిరుపేద ప్రజలు లబ్ధి పొందలేకపోతున్నారని మండిపడ్డారు. సుప్రీంకోర్టు ఆదేశాలు తర్వాత కూడా ఒడిశాలో పీఈఎస్‌ఏ చట్టం అమలు చేయకపోవడం వలన ఆదివాసీ ప్రజలు మౌలిక హక్కులకు దూరమవుతున్నారని ఆరోపించారు. వెంటనే అక్రమాలను అరికట్టి ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుశాంతకుమార్ బొడొకువార్, కొరాపుట్ జిల్లా బీజేపీ ఆదివాసీ మోర్చా సాధారణ కార్యదర్శి రుపు భొత్ర, కుంద్ర సమితి బీజేపీ ప్రభారి శంకర మహంతి, దిగాపూర్ బీజేపీ మండలి అధ్యక్షుడు బద్రీ ఆచార్య, దిగాపూర్ పంచాయతీ బీజేపీ అధ్యక్షుడు ప్రభాకర పండ, ఉపాధ్యక్షుడు అశ్వినీ చౌదరి, మోమటి, మోదేశ సహాయ కార్యదర్శి బాలకృష్ణ మఝి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ సురేంద్రనాథ్ రథ్ ఆత్మహత్య



సురేంద్రనాథ్ మృతదేహం



డాక్టర్ సురేంద్ర రథ్

పర్లాకిమిడి: గజపతి జిల్లా పర్లాకిమిడి కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న మెడిసిన్ స్పెషలిస్టు డాక్టర్ సురేంద్రనాథ్ రథ్ బరంపురంలోని తన మామగారి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలియజేశారు. సురేంద్రనాథ్ గత కొన్నేళ్లుగా పర్లాకిమిడి జిల్లా హెడ్‌క్వార్టర్ ఆస్పత్రిలో పనిచేస్తున్నారు. ఈనెల ఒకలో తేదీన బరంపురంలోని గుసానినువాగం శక్తినగర్‌లో ఉన్న తన మామగారింటికి వెళ్లారు. ఆయనకు ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు. ఎప్పుడూ తన పెద్ద కుమారుడు వద్దనే పడుకుంటాడు. సోమవారం ఉదయం పెద్ద కుమారుడు లేచినప్పుడు తన పక్కన తండ్రి లేకపోవడం చూసి, పక్కన వున్న గది తెరచి చూడగా తండ్రి ఉరివేసుకుని మృతి చెందినట్లు గమనించాడు. వెంటనే కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి దర్యాప్తు ప్రారంభించారు. డాక్టర్ రథ్ స్వగ్రామం రాయగడ జిల్లా కేంద్రం మంగలామందిర వీధి. ఆయనకు పర్లాకిమిడిలో డాక్టర్‌గా మంచి పేరుంది. ఆయన మృతికి సీడీఎంవో డాక్టర్ ప్రదీప్‌కుమార్ పాత్రో, ఆయన సహచరులు డాక్టర్ మహ్మద్ అలీ, డాక్టర్ ప్రదీప్‌కుమార్ పాఢి, డా.రవికుమార్ పాల్గొన్నారు.

బీఎస్‌ఎఫ్ అధికారులతో ఎస్పీ సమావేశం



సమావేశంలో చర్చిస్తున్న ఎస్పీ నితీష్ వాద్వనీ తదితరులు

మల్కన్‌గిరి: జిల్లాలోని ఎంవీ 3 గ్రామం వద్ద బీఎస్‌ఎఫ్ క్యాంప్ కేంద్రంలో బీఎస్‌ఎఫ్ అధికారులతో జిల్లా ఎస్పీ నితీష్ వాద్వానీ సోమవారం సమావేశమయ్యారు. మావోలు కట్టడికి సంబంధించి అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. జవాన్లకు ఎటువంటి శిక్షణ ఇవ్వాలి అనే అంశంపై చర్చించారు. అనంతరం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు.

విద్యార్థుల ధర్నా



రోడ్డుపై ధర్నా చేస్తున్న విద్యార్థులు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సోమవారం ధర్నా నిర్వహించారు. కళాశాలలో నూతన తరగతి గదులు నిర్మించాలని కోరారు. అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయాలని, లైబ్రరీ ఏర్పాటు చేయాలని తదితర సమస్యలు విన్నవించారు. కాలేజీ బయట రోడ్డుపైనే విద్యార్థులు బైఠాయించారు. సమస్యలు పరిష్కరిస్తేనే క్లాసులకు హాజరవుతామని పేర్కొన్నారు.

భారీగా గంజాయి స్వాధీనం

● నలుగురు నిందితులు అరెస్టు



అరెస్టైన నిందితులు



స్వాధీనం చేసుకున్న గంజాయి

బరంపురం: నగరం మీదుగా దేశ రాజధాని ఢిల్లీకి అక్రమంగా తరలిస్తున్న 100 కిలోల గంజాయిని బరంపురం ఎక్సైజ్ విభాగం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ కమిషనర్ రామచంద్ర మహంతి తెలిపిన వివరాల మేరకు.. గజపతి జిల్లా మోహనా అటవీ ప్రాంతం నుంచి దరింగబడి మీదుగా బరంపురం నగరానికి కారులో అక్రమంగా గంజాయిని తరలిస్తున్నట్లు ముందస్తుగా ఎక్సైజ్ అధికారులకు ఆదివారం సమాచారం అందింది. దీంతో వాహనాల సోదాలు నిర్వహించారు. దీనిలో భాగంగా అనుమానంతో ఒక కారులో సోదాలు నిర్వహించగా 100 కిలోల గంజాయి బస్తా బయటపడింది. దీంతో కారులో ఉన్న డ్రైవర్‌తో మరో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న గంజాం విలువ సుమారు రూ.16 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు.

గోశాలకు పశువులు తరలింపు



వేకువజామున రోడ్డుపై అడ్డంగా పడుకున్న పశువులు



రోడ్లపై ఉన్న పశువును వాహనంలోకి ఎక్కిస్తున్న సిబ్బంది

జయపురం:

పట్టణంలో ట్రాఫిక్ సమస్యకు కారణమవుతున్న పశువులను గోశాలకు పంపే కార్యక్రమాన్ని జయపురం మున్సిపల్ అధికారులు సోమవారం పునః ప్రారంభించారు. గతంలో రోడ్లపై సంచరిస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కల్పించే పశువులను గోశాలలకు పంపిన విషయం విదితమే. ఆయా పశువుల యజమానులకు జరిమానాలు విధించేవారు. అయితే కొంతకాలం పశువులను తరలించే ప్రక్రియను అధికారులు నిలిపివేశారు. దీంతో మరలా పశువుల యజమానులు పశువులను రోడ్లపై విడిచిపెడుతున్నారు. దీంతో సోమవారం వేకువజామున 26వ నంబర్ జాతీయ రహదారి, జయనగర్ రోడ్లపై అడ్డంగానున్నటువంటి పశువులను మున్సిపల్ సిబ్బంది పట్టుకొని, గోశాలకు తరలించారు.

అధిక దిగుబడులపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న సుమన్ పట్నాయక్, వేదికపై డాక్టర్ భొయ్, ధల్ తదితరులు



సమావేశంలో పాల్గొన్న రైతులు

రాయగడ: రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు వచ్చే పంటలపై దృష్టి సారించాలని జిల్లా అదనపు వ్యవసాయ శాఖ అధికారి సుమన్ పట్నాయక్ అన్నారు. జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో జేకేపూర్‌లో ఉన్న స్పర్శ సోషల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు వ్యవసాయానికి అనుకూలించడం లేదన్నారు. వర్షాలపై ఆధారపడి పంటలు పండించే రైతులు ఈ విషయాన్ని గమనించి, అందుకు అనుకూలంగా వ్యవహరించాలని సూచించారు. తక్కువ పెట్టుబడితో రెండింతల ఆదాయం వచ్చే కూరగాయల పంటలపై మొగ్గు చూపాలని హితవు పలికారు. అందుకు ప్రభుత్వం కూడా వివిధ పథకాల ద్వారా వారిని ఆదుకునేందుకు ముందుకు వస్తోందన్నారు. గౌరవ అతిథి అసిస్టెంట్ సోయల్ కన్జర్వేషన్ అధికారి గణేష్ సామంతరాయ్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ కరువవ్వడంతో సకాలంలో వర్షాలు కురవక ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ సమతుల్యానికి కృషి చేయాలని సూచించారు. స్పర్శ సోషల్ ఫౌండేషన్ జనరల్ మేనేజర్ ప్రఫుల్ల కుమార్ ధల్ మాట్లాడుతూ తమ పరిధిలోని రైతులకు అవగాహన కల్పించడంతో పాటు, సేంద్రీయ వ్యవసాయంపై చైతన్యం కల్పించేందుకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బిపిన్ చంద్ర బెహర, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ హడిబంధు భొయ్ తదితరులు పాల్గొన్నారు.

•స్నేహపూర్వకంగా..!



రాష్ట్రంలో అధికార బీజేడీ, ప్రతిపక్ష బీజేపీకి మధ్య నిరంతరం యుద్ధ వాతావరణం ఉంటున్న విషయం తెలిసిందే. వార్డు నుంచి భువనేశ్వర్ వరకు ప్రతిచోటా శత్రుభావమే నడుస్తుంది. సోషల్ మీడియాలో ప్రత్యక్ష యుద్ధమే కళ్లకి కనిపిస్తుంది. అయితే సోమవారం అందుకు భిన్నమైన వాతావరణం నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్ కోట్ సమితి రాయిఘర్ సమితి కేంద్రంలో చోటుచేసుకుంది. ప్రభుత్వ సాయంతో ఎస్‌హెచ్‌జీ మహిళల కోసం మిషన్ శక్తి కెఫే ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి బీజేడీకి చెందిన నబరంగ్‌పూర్ ఎంపీ రమేష్ చంద్ర మజ్జి, బీజేపీకి చెందిన ఉమ్మర్‌కోట్ ఎమ్మెల్యే నిత్యానంద గొండోలు హాజరయ్యారు. ఎమ్మెల్యేని చూడగానే ఎంపీ సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమం మొత్తం అయ్యేంత వరకు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఇద్దరూ ప్రాణమిత్రుల మాదిరిగా కలిసి తిరుగుతూ అక్కడ ప్రజలకు నవ్వించారు. దీంతో గొడవలు జరుగుతాయని భయపడిన అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

- కొరాపుట్

•ఘన స్వాగతం





కొరాపుట్ జిల్లా జయపురం దొంగరియ స్వచ్ఛంద సంస్థ సభ్యులు రఘునాథ్ స్వైన్, మురళీలు హిమాచలప్రదేశ్‌లో ఎత్తైన కైలాస పర్వతారోహణ ముగించుకుని సోమవారం జయపురం చేరుకున్నారు. దీంతో వారికి స్థానికులు ఘన స్వాగతం పలికారు. వారిరువురు కైలాశ పర్వత పంక్తుల్లో ఉన్న కిన్నాపుర్ పర్వత శిఖరాన్ని విజయవంతంగా అధిరోహించారు. పర్వతారోహులకు 26వ జాతీయ రహదారి బస్టాండ్ కూడలి వద్ద పూలమాలలు వేసి ఆహ్వానించారు.

- జయపురం

క్లుప్తంగా

మృతదేహంతో నిరసన



మృతదేహంతో నిరసన తెలుపుతున్న ముస్లిం కుటుంబాలు

వేపాడ: మండలంలోని జాకేరు గ్రామంలో ముస్లింలకు శ్మశాన వాటిక స్థలం లేకపోవడంతో ఆదివారం ముస్లిం స్త్రీ మృతదేహంతో నిరసన తెలిపారు. గ్రామానికి చెందిన ముస్లింలకు శ్మశాన వాటికకు ప్రత్యేక స్థలం కేటాయించాలని కొన్నేళ్లుగా కోరుతున్నప్పటికీ కేటాయించలేదని ముస్లింలు ఈ సందర్భంగా వాపోయారు. సోమవారం ముస్లిం మహిళ మృతదేహంతో ముస్లింలు నిరసన వ్యక్తం చేస్తున్న విషయం తహసీల్దార్ దృష్టికి రావడంతో గ్రామ సర్పంచ్ బుద్దా చిన్నమ్మలు, అప్పలనాయుడు దంపతులు స్పందించి ముస్లిం పెద్దలతో సంప్రదింపులు నిర్వహించి రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. పొలమరశెట్టి జగ్గారావు కళ్లం సమీపంలో ముస్లింలకు ఐదు సెంట్ల భూమిని గుర్తించి శ్మశాన వాటికకు కేటాయిస్తామన్నారు. అలాగే కేటాయించిన స్థలంలో ఎంపీపీ లేదా పంచాయతీ నిధులతో ప్రహరీ నిర్మిస్తామని సర్పంచ్ దంపతులు చెప్పడంతో ముస్లిం పెద్దలు ఎస్‌కె యాకూబ్, ఎస్‌కె ఉస్మాన్, ఎస్‌కె అబ్దుల్ సమక్షంలో సమస్య పరిష్కారమైంది. దీంతో మృతిచెందిన ముస్లిం స్త్రీని శ్మశానవాటికకు కేటాయించిన స్థలంలో ఖననం చేశారు.

మహిళ మృతదేహం లభ్యం



ఈశ్వరమ్మ మృతదేహం

రాజాం సిటీ: మండల పరిధి గురవాం గ్రామ సమీపంలోని రేవళ్ల చెరువుకు వెళ్లేదారిలో మహిళ మృతదేహం లభ్యమైంది. సోమవారం అటుగా వెళ్లిన స్థానికులు దుర్వాసన రావడంతో మృతదేహం ఉన్నట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తొలుత గుర్తుతెలియని మహిళ మృతదేహంగా భావించారు. అనంతరం పరిసర ప్రాంతాలకు చెందిన వారు ఎవరైనా ఇటీవల తప్పిపోయినట్లు పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసులపై ఆరా తీశారు. గ్రామ సచివాలయ మహిళా కానిస్టేబుళ్లను అప్రమత్తం చేయడంతో మృతదేహాన్ని బూరాడ గ్రామానికి చెందిన పొగిరి ఈశ్వరమ్మ (51)గా గుర్తించి కుటుంబసభ్యుల వద్ద వివరాలు తెలుసుకున్నారు. ఆమెకు మతిస్థిమితం సరిగా ఉండకపోవడంతో గతంలో పలుమార్లు ఇంటి నుంచి వెళ్లిపోయి కొన్ని రోజుల తరువాత మళ్లీ ఇంటికి చేరేదని ఆమె సోదరుడు సూర్యనారాయణ తెలిపాడు. ఈ క్రమంలోనే గత నెల 27న ఇంటి నుంచి వెళ్లిపోయిందని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశామని ఎస్సై పి.నీలావతి తెలిపారు.

మక్కువలో సీపీఎం ధర్నా



ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

మక్కువ: మండలంలోని తూరుమామిడి గ్రామానికి చెందిన పిన్నింటి ఈశ్వరరావు దివ్యాంగుల నకిలీ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డుల్లో వయస్సు మార్పులు చేయించి పింఛన్లు ఇప్పిస్తానని అమాయక ప్రజలను మోసం చేస్తున్నాడని, ఈశ్వరరావును తక్షణమే అరెస్ట్ చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపీడీవో కార్యాలయం ఎదుట సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం సూపరింటెండెంట్ భద్రీనాథ్‌కు వినతిపత్రం అందించారు.

320లీటర్ల సారా, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

పార్వతీపురం టౌన్: మండలంలోని అడ్డూరివలస గ్రామం వద్ద ఎస్‌ఈబీ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సోమవారం 320 లీటర్ల సారాతో పాటు రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ సీఐ జి.సతీష్ మాట్లాడుతూ ముందస్తు సమాచారం మేరకు దాడులు నిర్వహించి ఒడిశా రాష్ట్రం నుంచి రెండు ద్విచక్రవాహనాలపై 320లీటర్ల సారా రవాణా చేస్తుండగా ఒక నిందితుడు వెలగాడ అభిషేక్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. మరో నిందితుడు దేవుపల్లి అరుణ్ పరారీలో ఉన్నాడని సాధ్యమైనంత త్వరలో అదుపులోకి తీసుకుంటామని చెప్పారు. అభిషేక్‌పై కేసు నమోదుచేసి రిమాండ్ నిమిత్తం పార్వతీపురం ఎస్‌ఈబీ స్టేషన్‌కు తరలించామని వివరించారు. దాడుల్లో ఎస్సై రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

విన్నపాలు వినవలె..!



పర్లాకిమిడి: గ్రీవెన్స్‌లో పాల్గొన్న అధికారులు



పర్లాకిమిడి: అభాగ్యురాలికి చెక్కు అందజేస్తున్న స్మృతి రంజన్ ప్రధాన్



పర్లాకిమిడి: వినతులు స్వీకరిస్తున్న సీడీఎంవో డాక్టర్ పాత్రో

- గ్రీవెన్స్‌కు అనూహ్య స్పందన
- సమస్యలు విన్నవిస్తున్న ప్రజలు

రాయగడ: స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో కలెక్టర్ స్వాదాదేవ్ సింగ్ ఆధ్వర్యంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. తమ సమస్యలు వినివించేందుకు వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు తరలి వచ్చారు. సమస్యలు తెలుసుకున్న అధికారులు పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. కొలనార సమితి పరిధి కంకుబడి పంచాయతీలోని బడింగ, కెదాపడ, దుమురిగడు తదితర గ్రామాలకు చెందిన వృద్ధులు గత ఎనిమిది నెలలుగా తమకు వృద్ధాప్య పింఛన్లు అందడం లేదని విన్నవించారు. కాసీపూర్ సమితి టికిరి గ్రామానికి చెందిన రంజిత నాయక్(28) తన ముగ్గురు పిల్లలను వదిలి, భర్త ఎటువెళ్లిపోయాడో ఆచూకీ తెలయడం లేదని వాపోయారు. పలుసార్లు టికిరి, కాసీపూర్ పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందన్నారు. మూడేళ్లగా పిల్లలతో పోషణకు కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక బాబు రిహాన్ నాయక్ (7) గత రెండేళ్లుగా సికిలింగ్ వంటి వ్యాధితో బాధపడుతున్నాడని తెలియజేసింది. ప్రభుత్వం తన పిల్లలను ఏదైనా ఆశ్రమ పాఠశాలలో చదివించి, తన రెండో కొడుకు రిహాన్ చికిత్సకు సహకరించాలని కోరారు. దీంతో ఆదుకుంటామని కలెక్టర్ అభయం ఇచ్చారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో వివిధ సమస్యలకు సంబంధించి 68 వినతులు వచ్చాయి. ఇందులో 58 వ్యక్తిగత సమస్యలు కాగా, మిగతా పది గ్రామ సమస్యలుగా గుర్తించారు. వీరిలో ఆరుగురికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.1.25 లక్షల ఆర్థిక సహకారాన్ని, మరొకరికి రెడ్‌క్రాస్ నిధి నుంచి రూ.20 వేల సాయాన్ని అందించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ భీమసేన్ సాబొరొ, జిల్లా ముఖ్యవైద్యాధికారి డాక్టర్ లాల్ మోహన్ రౌత్రాయ్, జిల్లా సామాజిక సంక్షేమ శాఖ అధికారి యజ్ఞసేని బెహర, జిల్లా కార్మిక శాఖ అధికారి జాస్మిన్ సాహు, జిల్లా విద్యాశాఖ అధికారి పూర్ణచంద్ర బొరియా తదితరులు పాల్గొన్నారు.

పర్లాకిమిడి: స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌కు 96 వినతులు వచ్చాయి. దీనిలో భాగంగా ఒకరికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.5 వేల చెక్కును అందజేశారు. 29 వినతులు తక్షణమే పరిష్కరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సునీల్ కాంత మహంతి, డీఎఫ్‌వో ఎస్.ఆనంద్, అదనపు కలెక్టర్ బీరేంద్ర కుమార్ దాస్, ఏడీఎం రాజేంద్ర మింజ్, సీడీఎంవో డాక్టర్ ప్రదీప్ కుమార్ పాత్రో, జిల్లా ముఖ్యశిక్షాధికారి ప్రదోష్ కుమార్ నాయక్, ప్రజా వినతుల నోడల్ అధికారి నర్మదా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



రాయగడ: సమస్యలు వింటున్న కలెక్టర్ సింగ్



రాయగడ: పింఛన్లపై ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వృద్ధులు



రాయగడ: ముగ్గురు పిల్లలు కలిగిన తనను ఆదుకోవాలని కోరుతున్న యువతి

సమస్యలు పరిష్కరిస్తాం



అలేఖ్ మత గురువుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్ చంద్ర మజ్జి

కొరాపుట్: అలేఖ్ బాబా ఆశ్రమాల్లో సాదు జీవితం గడుపుతున్న వారి సమస్యలు పరిష్కరిస్తామని జొరిగాం ఎమ్మెల్యే ప్రకాష్ చంద్ర మజ్జి ప్రకటించారు. నబరంగ్‌పూర్ జిల్లా జొరిగాం సమితి పలియా, బనవాగుడ, రంస గ్రామాలు, ఉమ్మర్ కోట్ సమితి చొట్టాగుడ, హిరాపూర్ గ్రామాలను ఆయన సోమవారం సందర్శించారు. అలేఖ్ బాబాలతో నువాఖాయి విందు ఆరగించారు. అనంతరం జరిగిన సమావేశాల్లో అలేఖ్ మత గురువులు సమస్యలను ఎమ్మెల్యేకు తెలియజేశారు. యజ్ఞ శాలలు లేకపోవడం వలన వర్షాలు పడితే ఇబ్బందులు వస్తున్నాయన్నారు. ప్రహరీలు లేకపోవడంతో వన్య ప్రాణులు ఆశ్రమాల్లో చొరబడుతున్నాయని పేర్కొన్నారు. దీంతో వీలైనంత త్వరలో వారికి అవసరమైన యజ్ఞ శాలలు, ప్రహరీలు నిర్మిస్తామని అలేఖ్ మత గురువులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

దివ్యాంగురాలికి ట్రైసైకిల్ అందజేత



ప్రభుత్వం ఇచ్చిన ట్రై సైకిల్ మీద మమోని చక్రవర్తితో లలితా గోండో

కొరాపుట్: మహిళా పాత్రికేయురాలి సాయంతో దివ్యాంగురాలికి ఉచిత ట్రై సైకిల్ లభించింది. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రానికి 1కి.మీ దూరంలో చత్తీష్‌ఘడ్ రాష్ట్రానికి కూతవేటు దూరంలో, రాష్ట్రానికి కూతవేటు దూరంలో రాయిఘర్ సమితి గుణ గ్రామం ఉంది. గ్రామానికి చెందిన లలితా గోండోకు పుట్టుకతోనే రెండు కాళ్లు పనిచేయవు. నిరుపేద కావడంతో ఇంటికే పరిమితమైంది. గ్రామానికి చెందిన ఒక వ్యవసాయ కూలితో ఆమెకి వివాహం జరిపించారు. తనకు వ్యవసాయ పనులు చేసే శక్తి ఉందని, కానీ పొలం వరకు తీసుకొని వెళ్లేవారు లేరని లలితా వాపోయేది. ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న ట్రైసైకిల్ ఆమెకు లభించలేదు. దీంతో గ్రామానికి వచ్చిన ఒక ఒడియా దినపత్రిక పాత్రికేయురాలు మమోని చక్రవర్తికి తన గోడు వినిపించింది. దీంతో ఆమె లలిత గోడును వీడియో తీసి అధికారులకు చూపించింది. అధికారులు అదిరిపడి పరుగున ఆ గ్రామానికి వెళ్లి లలితకి ఉచితంగా ట్రై సైకిల్ అందజేశారు. ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.

తలనీలాలు వేలం రూ.33.15 లక్షలకు ఖరారు

- రామతీర్థంలో వేలంపాట నిర్వహణ



టెండర్ కం బహిరంగ వేలం నిర్వహిస్తున్న రామతీర్థం దేవస్థానం అధికారులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో తలనీలాలు, నిత్యావసర సరుకులు, కొబ్బరి చెక్కలు, పార్కింగ్ తదితర వాటికి సోమవారం నిర్వహించిన టెండర్ కం బహిరంగ వేలం ప్రక్రియ పూర్తయింది. దేవదాయశాఖ పర్యవేక్షణాధికారి పి.వి.లక్ష్మి ఆధ్వర్యంలో ముందుగా టెండర్లు నిర్వహించి అనంతరం వేలం పాటను ప్రారంభించారు. తలనీలాలు సేకరించేందుకు గుంటూరు జిల్లాకు చెందిన మేదర ఏడుకొండలు రూ.33,15,000, కొబ్బరి చెక్కల సేకరించేందుకు, కాకినాడకు చెందిన గింజల హరీష్ రూ.13,10,000కు దక్కించుకున్నారు. స్వామి వారి ప్రసాదాల తయారీకు అవసరమైన నిత్యావసర దినుసుల సరఫరాకు రణస్థలం మండలానికి చెందిన రాఘవేంద్ర తక్కువ ధరకు కోట్ చేశారు. పార్కింగ్ స్టాండ్ నిర్వహణను జగ్గరాజుపేటకు చెందిన కల్యాణపు రమణ దక్కించుకున్నారు. నిత్యాన్నదానానికి కూరగాయలు సరఫరా చేసేందుకు విజయనగరం, గుర్లకు చెందిన రాజబాబు, శనపతి శ్రీనివాసరావు వేలంలో దక్కించుకున్నారు. ఏడాది కాలానికి టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించినట్టు ఈఓ కిషోర్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో దేవస్థాన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సూర్యనారాయణ మృతి బీజేడీకి తీరనిలోటు



సూర్యనారాయణ పాత్రో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పర్లాకిమిడి: రాష్ట్ర శాసనసభ మాజీ స్పీకర్, దిగపహాండి మాజీ ఎమ్మెల్యే సూర్య నారాయణ పాత్రో మృతి బీజేడీకి తీరని లోటని వక్తలు అన్నారు. స్థానిక బీజేడీ పార్టీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఆయన సంతాప సభను గజపతి బీజేడీ అధ్యక్షుడు జగబంధు దాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సూర్యనారాయణ 1978 నుంచి పార్టీ క్రియాశీలక రాయకీయాల్లో పాల్గొనేవారు అన్నారు. మోహనా నియోజకవర్గం నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిపొందారని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బసంత్ దాస్, వి.ఎస్.ఎన్.రాజు, జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, గుసాని సమితి అధ్యక్షుడు ఎన్.వీర్రాజు, ప్రదీప్ నాయక్, జమీదార్ పట్నాయిక్, మొంటు దాస్, యువజన నాయకుడు శాసనం లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలను

సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో పార్వతి

పాచిపెంట: స్వచ్ఛంద సంస్థల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో పార్వతి అన్నారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆర్ట్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గిరిజన హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హక్కుల సాధన కోసం గిరిజనులు చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పథకాలపై కూడా గిరిజనులను చైతన్య పరచాలని సూచించారు. ఆర్ట్స్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ దుర్గారావు మాట్లాడుతూ అటవీ హక్కుల చట్టం సక్రమంగా అమలు కావడం లేదని గిరిజనులు సాగుచేస్తున్న పోడుకు చాలా మేరకు హక్కులు కల్పించలేదని అనంతగిరి రేంజ్ పరిధిలో పోడు భూములకు పట్టలేవ్వాలని కోరారు.

గో హత్యపై ఆరుగురిపై కేసు

పార్వతీపురంటౌన్: మండలంలోని బాలగుడబ గ్రామంలో గోవును చంపిన ఘటనలో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సింహాచలం చెప్పారు. ఈ మేరకు సోమవారం ఆయన రూరల్ పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ రైతు మువ్వల తిరుపతిరావు పశువుల పాకలో ఉన్న గోవు కనబడకపోవడంతో గ్రామమంతా వెతికాడు. గ్రామ శివారులో ఉన్న జీడితోటలో ఆవుమాంసం, తోలును గమనించి తోటలో ఉన్న కొంతమంది వ్యక్తులపై అనుమానం వచ్చి ప్రశ్నించగా అంతా పరారయ్యారు. దీంతో వారిపై బాధిత రైతు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టి అనుమానం ఉన్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



ఆవు చర్మాన్ని చూపుతున్న బాధిత రైతు

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి



మృతురాలు అనూష

పాలకొండ: నగవం చాయతీలోని గారమ్మ కాలనీలో నివాసం ఉంటున్న కూనబిల్లి అనూష(21) సోమవారం ఉదయం 10 గంటల సమయంలో ఇంట్లో ఉరివేసుకుని అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. ఈ ఘటనపై ఎస్సై శివప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనూషకు గడిచిన మే నెలలో వివాహం జరిగింది. ఆషాడం మాసంలో పుట్టింటికి వచ్చి ఇక్కడే ఉంటోంది. సోమవారం తండ్రి దుర్గారావు కూలి పనికి వెల్ల, తల్లి మార్కెట్‌కు వెళ్లారు. తల్లి మార్కెట్ నుంచి తిరిగి ఇంటికి వచ్చే సమయానికి కుమార్తె ఉరివేసుకున్నట్లు తల్లి ఫిర్యాదులో మృతురాలి తల్లి పేర్కొంది. ఈ మేరకు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించామని, మంగళవారం రిపోర్టు వస్తుందని ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.



కనకరావు(ఫైల్)


చెట్టుపై నుంచి జారిపడి యువకుడు..

భోగాపురం: భోగాపురం పంచాయతీ కొయ్యపేట గ్రామంలో చెట్టుపై నుంచి జారిపడి సోమవారం ఓ యువకుడు మృతిచెందాడు. భోగాపురం పంచాయతీ కొయ్యపేట గ్రామానికి చెందిన బాకి కనకరావు(32) పూల వ్యాపారం చేసుకుంటూ కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామంలోని యాజమానుల పూలతోటల వద్దకు వెళ్లి పూలు కొనుగోలు చేసి వాటిని విశాఖపట్నం జిల్లా అనంతపురం గ్రామానికి తీసుకువెళ్లి అధిక ధరకు అమ్ముకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఒక యాజమాని తోటలో ఉన్న సంపంగి చెట్టు ఎక్కి పూలు కోస్తూ ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారి కిందకు పడిపోయాడు. ఇది గమనించిన స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించారు. 108 సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య సూరమ్మతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.



• గిరిజన ఇంట సీతాఫలం సిరి

సీతాఫలం పంట గిరిజన రైతులకు సిరులు కురిపిస్తోంది. పంట సాగుకు ప్రకృతి అనుకూలించడంతో దిగుబడులు పెరిగాయి. ఏజెన్సీలో ఏ గ్రామంలో చూసినా సీతాఫలాలే కనిపిస్తున్నాయి. గుమ్మలక్ష్మీపురం మండలంలోని రాయగడజమ్ము, మంత్రజోల, పెంగవ, గడవంకధార, బాతుగుడబ, పాములగీసాడ, బయ్యాడ, మూల జన్నిడి, కొండజన్నిడి, చాపరాయి జన్నిడి, దేరువాడ, కుస, లాడ, వనకాబడి, తోట, గోరటి, ఓడ్రుబంగి, కప్పకళ్లు, దేరుగండ, వాడబాయి, వంగర, కీసరి, డోలుకోన తదితర గ్రామాల్లో సీతాఫలాలు విరివిగా లభిస్తున్నాయి. మైదాన ప్రాంత వ్యాపారులు వచ్చి కావిడ పండ్లను రూ.600కు కొనుగోలు చేస్తున్నట్లు గిరిజన రైతులు చెబుతున్నారు. - గుమ్మలక్ష్మీపురం



క్లుప్తంగా

కుళాయి పనులకు భూమిపూజ

ఇచ్ఛాపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గ్రామాల్లో మంచినీటి సౌకర్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎంపీపీ బోర పుష్ప అన్నారు. కొళిగాం గ్రామంలో ఇంటింటికీ కుళాయి ఏర్పాటు పనులకు సోమవారం భూమిపూజ చేశారు. సర్పంచ్ సంతోష్ మండలా, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారిగా సత్యనారాయణ



ఇచ్ఛాపురం రూరల్: మండల వ్యవసాయాధికారిగా పూజారి సత్యనారాయణ సోమవారం విధుల్లో చేరారు. ఇప్పటి వరకు మండల వ్యవసాయాధికారిగా పనిచేసిన తారపురెడ్డి భార్గవి ఉన్నత చదువుల కోసం వెళ్లిపోవడంతో సోంపేట ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌లో ఏవోగా పనిచేస్తున్న సత్యనారాయణను ఏవోగా నియమించారు.

నేడు అప్పయ్యదొర వర్ధంతి

వజ్రపుకొత్తూరు: దివంగత మాజీ ఎంపీ హనుమంతు అప్పయ్యదొర వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం బెండిగేటు వద్ద నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి తమ్మినేని శాంతారావు తెలిపారు. ఉదయం 9.30 గంటలకు బెండిగేటు బైపాస్ ఫ్లైఓవర్ వద్ద ఉన్న దొర విగ్రహానికి మంత్రి సీదిరి అప్పలరాజు పూలమాల వేసి నివాళులర్పిస్తారన్నారు.

భూహక్కు పత్రాలు పంపిణీ

కంచిలి: భూహక్కు పత్రాలతో భూయజమానులతోపాటు వారి ఆస్తికి మరింత రక్షణ ఏర్పడుతోందని తలతంపర సర్పంచ్ జగబందు దొలాయి, ఎంపీటీసీ సభ్యుడు బృందావన్‌సాహులు అన్నారు. తలతంపర పంచాయతీ పరిధిలోని 150 మంది రైతులకు మంజూరైన భూహక్కు పత్రాలను పంపిణీ చేశారు.

ఎరువుల వాడకంపై దృష్టిపెట్టాలి

సోంపేట: ఖరీఫ్ సీజన్‌లో వరి పంటకు ఆశించే చీడపీడల నివారణ, ఎరువుల వాడకంపై రైతులు ప్రత్యేక దృష్టిపెట్టాలని వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి అన్నారు. డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని పాలవలస రైతు భరోసా కేంద్రం పరిధిలోని వ్యవసాయక్షేత్రంలో సోమవారం నిర్వహించారు.

నాయీబ్రాహ్మణ సంఘం కార్యవర్గం ఏర్పాటు

వజ్రపుకొత్తూరు: పూండి–గోవిందపురం నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఏర్పాటైంది. సోమవారం పూండిలో ఎన్నిక ప్రక్రియ జరగ్గా.. అధ్యక్షుడుగా లావేటి శంకరరావు, ఉపాధ్యక్షుడుగా పి.రమణ, కార్యదర్శిగా రాళ్లపేట చంద్రయ్య, కోశాధికారిగా ఎ.చిన్నారావు ఎన్నికయ్యారు.

నేడు అక్కుపల్లిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లి గ్రామంలో మంగళవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పుక్కళ్ల గురయ్యనాయుడు సోమవారం తెలిపారు. మంత్రి సీదిరి అప్పలరాజు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

ఉపాధ్యాయులను గౌరవించాలి



సత్కారం పొందిన ఉపాధ్యాయులు

సోంపేట: ఉపాధ్యాయులను ప్రతిపౌరుడు గౌరవించాలని ఐఎఫ్ఎస్ఎస్ఎస్ ఫౌండేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని బారువ పూర్వవిద్యార్థి సంఘభవనం వద్ద ప్రత్యేక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బారువ గ్రామంలోని సుమారు వంది మంది ఉపాధ్యాయులను దుశ్శాలువలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

వైఎస్సార్‌సీపీలోకి కొయ్యడూరు యువకులు



మంత్రి అప్పలరాజు సమక్షంలో పార్టీలో చేరిన యువకులు

కాశీబుగ్గ: మందస మండలం కొండలోగాం పంచాయతీ కొయ్యడూరు గ్రామానికి చెందిన పలువురు గిరిజన యువకులు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. పలాసలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి సీదిరి అప్పలరాజు సమక్షంలో వీరంతా సోమవారం పార్టీలో చేరారు. వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

17న సంగీత విభావరి

శ్రీకాకుళం కల్చరల్: ఈ నెల 17వ తేదీన బాపూజీ కళా మందిర్‌లో ప్రముఖ గాయకులైన ఘంటసాల వెంకటేశ్వరరావు, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పేరిట సినీ సంగీత విభావరి ఉంటుందని నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖకు చెందిన నారీభేరి సంస్థ, శ్రీకాకుళం సుకుమార్ ఆర్కెస్ట్రా సంయుక్తంగా సంగీత విభావరి నిర్వహిస్తాయన్నారు.

ఇంటి యజమానులయ్యారు

- ఏళ్ల నిరీక్షణ అనంతరం ఇంటికి యజమానులైన పేదలు
- అద్దె కష్టాలు తప్పాయని ఆనందం
- శ్రీకాకుళం టిడ్కో ఇళ్లలో ఆనందంగా లబ్ధిదారులు
- త్వరలోనే సచివాలయం ఏర్పాటు



పార్కు వద్ద ఆడలాడుకుంటున్న చిన్నారులు

శ్రీకాకుళం రూరల్: బతుకంతా అద్దెలు కడుతూ, ఏళ్లకు ఏళ్లు ఇళ్లు మారుతూ గడిపేసిన సగటు జీవులు ఎట్టకేలకు ఇంటి యజమానులయ్యారు. సొంత చిరుమానా అంటూ లేక ఇన్నాళ్లూ ఇబ్బంది పడిన బడుగు జీవులు శాశ్వత కేరాఫ్ అడ్రస్ సంపాదించారు. అద్దె కొంపలకు స్వస్తి పలికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన టిడ్కో ఇళ్లలో స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. అంచెలంచెలుగా ఒక్కో కుటుంబం ప్రస్తుతం టిడ్కో ఇళ్లలో స్థిరపడుతోంది. శ్రీకాకుళం రూరల్ మండలం పాత్రునివలసలో 1280 టిడ్కో ఇళ్లను ప్రారంభించారు. ప్రస్తుతం 300 కుటుంబాలు అక్కడ నివాసముంటున్నాయి. వీరంతా ఇది వరకు అద్దె ఇళ్లలో నివాసం ఉన్నవారే. సీఎం వైఎస్ జగన్ దయతో సొంత ఇల్లు రావడంతో ఆనందంగా గడుపుతున్నారు.

సకల సౌకర్యాలు

ప్రస్తుతం శ్రీకాకుళం టిడ్కో ఇళ్లలో నివాసం ఉంటున్న వారికి అన్ని సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. తాగడానికి రెండు పూటలు మంచినీరు, రోడ్లు, డ్రైనేజీలు, వీధి లైట్లు అన్నీ ఏర్పాటు చేశారు. నీటిని ప్యూరిఫైర్ చేసే ట్యాంక్‌లను సైతం మున్సిపల్ యంత్రాంగం అందుబాటులోకి తీసుకొచ్చింది. వ్యాపార లావాదేవీలు నిర్వహించుకునేందుకు గాను స్థానికంగానే టిఫిన్ నుంచి సాయంత్రం స్నాక్స్ వరకూ ఇక్కడే దుకాణాలు ఏర్పాటయ్యాయి.

సచివాలయం ఏర్పాటు చేస్తాం



మరికొద్ది రోజుల్లోనే టిడ్కో గృహ సముదాయాల వద్ద సచివాలయం ఏర్పాటు చేస్తాం. ప్రస్తుతం నగరంలో 48 సచివాలయాలు ఉన్నాయి. ఇందులో ఒక సచివాలయాన్ని టిడ్కో వద్దకు తీసుకొచ్చేందుకు కలెక్టర్‌కు ప్రతిపాదన పెట్టాం. స్థానికంగా పెన్షన్‌లు, రేషన్‌లు అందేలా చూస్తాం. అలాగే నిర్మాణంలో ఉన్న జగనన్న మార్ట్‌ను కల్యాణ మండపంగా మారిస్తే స్థానికంగా శుభకార్యాలు చేసుకునేందుకు కూడా ఉపయోగంలోకి ఉంటుంది. దీనిపై దృష్టి పెడతాం.

– చల్లా ఓబులేసు, మున్సిపల్ కమిషనర్

అద్దె కొంపల నుంచి విముక్తి



నేను సి బ్లాక్ పదో నంబర్‌లో నివాసం ఉంటున్నాను. టిడ్కో ఇల్లు రాక ముందు బలగ ప్రాంతంలో రూ.3వేల అద్దెకు ఉండేదాన్ని. ఎన్నో ప్రభుత్వాలు చూశాం. చేసి చూపించిన నాయకుడు ఒక్క జగనన్న మాత్రమే. మాకు స్థిరనివాసం కల్పించారు. ఆయన రుణం తీర్చుకోలేము.

– డబ్బీరు లలిత, టిడ్కో నివాస వాసి

అన్నీ దొరుకుతున్నాయి



ఇక్కడ మొదట్లో దుకాణాలు ఉండేవి కావు. మున్సిపల్ కమిషనర్‌కు మొరపెట్టుకోవడంతో 15 షాపులు పెట్టుకోవడానికి అనుమతి ఇచ్చారు. నిత్యావసర సరుకులు నుంచి చికెన్, మటన్, బార్బర్ షాపులు, మెడికల్ స్టోర్స్, కిరాణా దుకాణాలు, గాజుల షాపులు సైతం అన్ని ఇక్కడే వెలిశాయి.

– పి.సృజనత, టిడ్కో నివాసి

రేషన్ ఇవ్వాలి



నేను జాలరి వీధిలో నెలకు రూ.4 వేలకు అద్దెకు ఉండేదాన్ని. టిడ్కో ఇంటికి మారాను. రేషన్, పెన్షన్ సదుపాయం కూడా ఇక్కడ కల్పిస్తే ఇంకా బాగుంటుంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వల్లే మేం పిల్లాపాపలతో సంతోషంగా ఉన్నాం.

– ఆర్.పార్వతీ, టిడ్కో ఇంటి యజమాని

వరం ఆశయాలను కొనసాగిస్తాం



వరం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

శ్రీకాకుళం: శ్రీకాకుళం మున్సిపల్ మాజీ చైర్మన్, వ్యాపారవేత్త అంధవరపు వరహానర్సింహం (వరం) ఆశయాలు కొనసాగిస్తామని కుటుంబ సభ్యులు అన్నారు. గుజరాతిపేటలోని అంధవరపు వరహానర్సింహం ఉన్నత పాఠశాల ఆవరణలో వరం జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి సోమవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. వరం రెసిడెన్సీలో జరిగిన కార్యక్రమంలో వాహన మెకానిక్‌లకు గురజాడ విద్యా సంస్థల వ్యవస్థాపకుడు జీవీ స్వామినాయుడు చేతుల మీదిగా దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి, కుమారులు ప్రసాద్, సంతోష్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



లబ్ధిదారులకు పౌష్టికాహారం అందజేస్తున్న సీతామహలక్ష్మి

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని కృష్ణా పార్క్ సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. పుణ్యపువీధి 1, 2 రాచకట్ల వీధి, సున్నపువీధి అంగన్‌వాడీ కేంద్రాలలో సెక్టార్ పర్యవేక్షకురాలు పి.సీతామహాలక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతామహాలక్ష్మి మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో మన ఇంటి వద్దే పోషకాహారాలు ఉత్పత్తి చేసుకోవచ్చునన్నారు. వాటిపై అవగాహన కల్పించారు. అనంతరం వీధుల్లో రాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు సంధ్యారాణి, ఉమారాణి, పైడిరాజు, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక చట్టాలను రద్దుచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కె.వి.వి ప్రసాద్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన రైతు వ్యతిరేక చట్టాలను రద్దుచేయాలని కోరుతూ నవంబర్ 26 నుంచి 28 తేదీల్లో రాష్ట్ర రాజధానుల్లో పెద్ద ఎత్తున రైతులతో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి ప్రసాద్ అన్నారు. రైతులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన మూడు చట్టాలను రద్దు చేస్తామని, విద్యు సంస్కరణ బిల్లును నిలుపదల చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ మాట ఇచ్చినప్పటికీ.. నేటికీ హామీలు నెరవేర్చలేదన్నారు. దీంతో గత నెల 24న ఢిల్లీలో జరిగిన కిసాన్ సంయుక్త మోర్ (ఎస్‌కెఎమ్) పిలుపులో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక చర్యలపై రైతుల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారన్నారు. లక్కింపూర్ ఖేరీలో ఘటనకు కారణమైన కేంద్ర ప్రభుత్వం హోంశాఖ సహాయ మంత్రి అజయ్ ఇస్తాను భర్తరఫ్ చేయాలని కోరుతూ అక్టోబర్ 3న బ్లాక్ డే, నవంబరు 26 నుంచి 28 వరకు రాష్ట్ర రాజధానుల్లో గల గవర్నర్ కార్యాలయం వద్ద చేపట్టనున్న మహాధర్నా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఢిల్లీలో డిసెంబర్, జనవరి నెలల్లో భారీ ప్రదర్శన సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. రైతు సంఘం రాష్ట్ర నాయకులు బుడితి అప్పలనాయుడు, రామకృష్ణ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమం చేరువ

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దువ్వాడ వాణి



పింఛన్లను అందజేస్తున్న దువ్వాడ వాణి

సంతబొమ్మాళి: రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద కొత్తగా మంజూరైన 389 పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధితో రాష్ట్రాన్ని ప్రగతి పథంలోకి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకెళ్తున్నారన్నారు. ప్రతిఇంటికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతోందన్నారు. సచివాలయ, వలంటరీ వ్యవస్థతో ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పాల వసంతరెడ్డి, ఎంపీపీ మెరుగు రాజేశ్వరి, పీఏసీఎస్ అధ్యక్షుడు కెల్లి జగన్నాయకులు, ఎంపీడీవో ప్రేమలీల పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటర్ల జాబితా తయారీ



కొనకలో సర్వే ప్రక్రియ పరిశీలిస్తున్న అధికారులు

కంచిలి: పకడ్బందీగా ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియ చేపట్టాలని నియోజకవర్గ డిలేషన్స్ ప్రత్యేకాధికారి, డీఎల్‌పీవో ఐ.వి.రమణ సిబ్బందికి సూచించారు. కొనక గ్రామంలో ఆయన సోమవారం పర్యటించారు. అక్కడ ఇంటింటికీ వెళ్లి మరణించిన ఓటర్ల తొలగింపుపై ఆరా తీశారు. ఓటర్ల తొలగింపు ప్రక్రియను చాలా అప్రమత్తంగా చేపట్టాలని, అన్ని ఆధారాలు పరిశీలించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి సర్వేశ్వరరావు, రెవెన్యూ, అంగన్‌వాడీ సిబ్బంది ఉన్నారు.

ఓటర్ల సర్వే పరిశీలన

ఇచ్ఛాపురం రూరల్: ఓటర్ల జాబితా తయారీలో పారదర్శకత ఉండాలని నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేకాధికారిగా వ్యవహరిస్తున్న డీఎల్‌పీవో ఇప్పిలి వెంకటరమణ అన్నారు. సోమవారం బూత్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించిన అనంతరం లొద్దపుట్టి పోలింగ్ కేంద్రం పరిధిలోని బీఎల్‌వోలు ఓటర్ల జాబితా సర్వే చేసిన విధానాన్ని ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు, ఓటర్ల నమోదు, తొగింపు, బదిలీ వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మరణించిన వారి ఓట్లకు సంబంధించి కుటుంబ సభ్యులతో దరఖాస్తు చేయించి వాటిని తొలగించాలన్నారు. ఆయన వెంట నియోజకవర్గ ఎన్నికల ఉప తహసీల్దార్ బలివాడ శ్రీహరి, పంచాయతీ కార్యదర్శి పి.సురేష్ ఉన్నారు.

ఎన్నికలకు సిద్ధం కావాలి

ఎచ్చెర్ల క్యాంపస్: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు సిద్ధం కావాలని ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి అన్నారు. బుడగుట్లపాలెం, అజ్జరాం గ్రామాల్లో కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందజేసిందన్నారు. అలాగే ప్రభుత్వ భవనాల నిర్మాణం, అభివృద్ధి పనులను గ్రామాల్లో చేపట్టిందని..ఈ విషయాన్ని ఇంటింటికీ వెళ్లి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ మూగి శ్రీరాములు, మండల పార్టీ అధ్యక్షుడు ముద్దాడ శంకర్, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు రాంబాబు, నాయకులు చిన్నారెడ్డి, బోర సాయిరాంరెడ్డి ఉన్నారు.

నూతన పింఛన్ల అందజేత

రణస్థలం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ల మొత్తాన్ని దశలవారీగా పెంచుకుంటూ ప్రస్తుతం రూ. 2,750 అందజేస్తున్నారని ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. ఇచ్చినమాట ప్రకారం జనవరి నాటికి రూ. మూడు వేలు ఇస్తారన్నారు. నారువ గ్రామ సచివాలయ పరిధిలో కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే సోమవారం పంపిణీ చేశారు. స్థానిక పంచాయతీ సర్పంచ్ కాటకుని దేవి, నారువ, మెంటాడ నాయకులు ఆర్ఎస్ రెడ్డి, లంకలపల్లి రామారావు, పాల రాము ఉన్నారు.

ఆశవర్కర్లకు నియమాక పత్రాలు అందజేత

రణస్థలం: ఆశ వర్కర్లుగా పలువురు ఎంపికయ్యారు. వీరికి ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మైలపల్లి కామరాజు, చీకటి యర్రయ్య, ఉప్పాడ అప్పన్న, అల్లిపల్లి అప్పన్న ఉన్నారు.

వలంటీర్లకు..

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలో పలు గ్రామ సచివాలయాల్లో పని చేసేందుకు ఎంపికైన వలంటీర్లకు ఎంపీపీ మొదలవలస చిరంజీవి నియామక పత్రాలను అందజేశారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్‌పై అవగాహన అవసరం

ఎచ్చెర్ల క్యాంపస్: ఇంజినీరింగ్ విద్యపై విద్యార్థులకు అవగాహన అవసరమని ఎచ్చెర్లలోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సి.వి.రమణమూర్తినాయుడు అన్నారు. కళాశాలలో ప్రథమ సంవత్సరం క్లాస్ వర్కును సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన విద్యార్థులు ఇంజినీరింగ్‌లో చేరారని, ఇప్పటి వరకు విద్యార్థులు చదివిన విద్యకు, ఇంజినీరింగ్ విద్యకు తేడా ఉంటుందని అన్నారు.

పరిశ్రమలకు వారానికో రోజు పవర్ హాలిడే

- నేటి నుంచి పది రోజుల పాటు కచ్చితంగా అమలు
- విద్యుత్ శాఖ ఎస్ఈ దైవప్రసాద్



అరసవల్లి: అధిక స్థాయి విద్యుత్ డిమాండ్, విద్యుత్ కొరత సమస్యలను అధిగమించడానికి వారానికి ఒకరోజు పరిశ్రమలకు పవర్ హాలిడే విధిస్తున్నట్లుగా విద్యుత్ శాఖ ఎస్ఈ ఎల్.దైవప్రసాద్ తెలియజేశారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గృహ, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు పరిశ్రమలకు ఈనెల 5 నుంచి (మంగళవారం నుంచి) ఈనెల 15వ తేదీ వరకు షరతులతో కూడిన పవర్ హాలిడేకి ఏపీఈఆర్సీ అనుమతించినట్లుగా ఆయన పేర్కొన్నారు. జిల్లాలో ఫార్మాస్యూటికల్, మెడికల్ ఆక్సిజన్ ఉత్పత్తి, బల్క్ డ్రగ్ పరిశ్రమలు తదితర పరిశ్రమల వినియోగదారులంతా ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఒక షిఫ్ట్‌లో మాత్రమే పరిశ్రమలను నడపాలని విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో జిల్లాలో మండలాల వారీగా పవర్ హాలిడేను విధించేలా షెడ్యూల్‌ను సిద్ధం చేశామని, ఈ ప్రకారం అమలు చేయని పరిస్థితుల్లో ఏపిఈఆర్సీ ఆదేశాల మేరకు ఆయా పరిశ్రమల యాజమాన్యాలకు అపరాధ రుసుం విధిస్తామని పేర్కొన్నారు.


జిల్లాలో షెడ్యూల్ ఇలా

సోమవారం : ఎచ్చెర్ల, ఆమదాలవలస, సరుబుజ్జిలి, బూర్జ, హిరమండలం, ఎల్ఎన్.పేట, ఇచ్ఛాపురం, పాలకొండ.
మంగళవారం: జి.సిగడాం, పొందూరు, కోటబొమ్మాళి, కంచిలి, వీరఘట్టం,.
బుధవారం: పైడిభీమవరం, లావేరు, రణస్థలం, నందిగాం, సంతబొమ్మాళి, కవిటి, భామిని.
గురువారం: శ్రీకాకుళం (డి-1,డి-2,,డి-4, గార), టెక్కలి, పాతపట్నం, సోంపేట, సీతంపేట.
శుక్రవారం: శ్రీకాకుళం రూరల్, నరసన్నపేట, పోలాకి, మందస.
శనివారం: జలుమూరు, సారవకోట, వజ్రపుకొత్తూరు.
ఆదివారం: మెళియాపుట్టి, కొత్తూరు, పలాస-కాశీబుగ్గ

'అంకితభావంతో పనిచెయ్యండి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: నిబద్ధత, అంకిత భావంతో విధులు నిర్వహించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ పేర్కొన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం కారుణ్య నియామక పత్రాలను కలెక్టర్ అందజేశారు. జిల్లాలో వివిధ శాఖల్లో పనిచేస్తూ కోవిడ్‌తో మృతి చెందిన నలుగురి కుటుంబ సభ్యులకు సచివాలయాల్లోని వివిధ శాఖల్లో కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ మురళీకృష్ణ, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



గణితావధాని తిరుపతిరావును సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధి రత్తకన్న గ్రామంలోని వినాయక విద్యానికేతన్ పాఠశాల ఆవరణలో ముందస్తుగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కంచిలి మండలం బూరగాం గ్రామానికి చెందిన గణిత అవధాని మద్దు తిరుపతిచే గణిత ద్వాదశావధానం చేశారు. గణితమంటే భయపడ వద్దని విద్యార్థులకు సూచించారు. అనంతరం తిరుపతి మాస్టార్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కోకిల, కృష్ణారావు, హెచ్‌ఎం తిరుపతి రావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా సంబరం



ఖోఖో పోటీలో బాలికలు

ఇచ్ఛాపురం రూరల్: మండపల్లి ఉన్నత పాఠశాల ఆవరణలో పాఠశాల స్థాయిలో క్రీడా పోటీలు ఉత్సాహంగా సోమవారం ప్రారంభమయ్యాయి. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన అండర్ 14, 17 ఏళ్లలోపు బాల బాలికలు పాల్గొన్నారు. తొలిరోజు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, టెన్నికాయిట్ పోటీలను నిర్వహించారు. ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మలు పోటీలను ప్రారంభించి మాట్లాడారు. సర్పంచ్ పిట్ట శశిరేఖ, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, పిట్ట మామయ్య, ప్రధానోపాధ్యాయులు జాడు ప్రకాశరావు, పీడీ కొయ్య పద్మనాభం పాల్గొన్నారు.

అర్ధరాత్రి గొర్రెలపై దాడి



గొంతుకోసి దగ్గర్లో ఉన్న పొదల్లో పడేసిన గొర్రె

నందిగాం: మండలంలోని కవిటి అగ్రహారంలో 15 గొర్రెలు, ఒక మేకపోతును అర్ధరాత్రి చంపి, వాటిని తరలించుకుపోయిన సంఘటనతో ఊరు ఉలిక్కి పడింది. కవిటి అగ్రహారానికి చెందిన రోణగల తవిటయ్యకు మేకలు, గొర్రెలు కలిసి సుమారు వంద వరకు ఉన్నాయి. వాటిని పగలంతా మేపుతూ రాత్రి బస్టాండ్‌కు సమీపంలో రేకు షెడ్డులో ఉంచుతుంటారు. సోమవారం ఉదయం తవిటయ్య కుమారుడు గోపాలకృష్ణ షెడ్డుకు వచ్చి చూసేసరికి షెడ్డులో పలు చోట్ల రక్తపు మరకలు కనిపించాయి. దీంతో మూగ జీవాలను లెక్కపెట్టేసరికి 15 గొర్రెలు, ఒక మేకపోతు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. చుట్టు పక్కల వెదకగా పీక కోసి పొదల్లో పడేసిన గొర్రె కనిపించింది. దీంతో ఊరిలో విషయం చెప్పా డు. అంతా కలిసి ఏం జరిగిందో ఆరా తీశారు.

మటన్‌షాపులో అమ్మజూపాడు

సోమవారం వేకువజామున అదే గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుడు ముడి మంచి మల్లేసు వజ్రపుకొత్తూరు మండలం పూండీలో ఉన్న మటన్ షాపు యజమాని గోపీకి ఫోన్ చేసి మేకపో తు అమ్ముతానని, షాపు వద్దకు రావాలని చెప్పాడు. అయితే రాత్రి వేళలో అమ్ముతాననడంతో అనుమానంతో గోపీ రాలేదు. అయితే అదే సమయంలో రాత్రి గస్తీ తిరుగుతున్న వజ్రపుకొత్తూరు పోలీసులు మల్లేసు కదలికలపై అనుమానం వచ్చి ప్రశ్నించడంతో పొంతన లేని సమాధానాలు చెప్పాడు. దీంతో గోపీ వద్దకు తీసుకెళ్లి ప్రశ్నించారు. గొర్రెపోతును తాను కొనలేదని గోపీ చెప్పడంతో మల్లేసు ఫొటో తీసి విడిచిపెట్టారు. అయితే గొర్రెలు కనిపించడం లేదనే వార్త చుట్టుపక్కల గ్రామాలకు వ్యాపించడంతో మల్లేసు పరారయ్యాడు.

రయ్ రయ్‌మంటూ..



అడవికొత్తూరు గ్రామానికి బైక్‌పై వెళ్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న మారుమూల గ్రామం అడవికొత్తూరుకు రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ద్విచక్ర వాహనంపై సోమవారం వెళ్లారు. 2వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా గ్రామానికి చేరుకోవాల్సి ఉండగా వానల కారణంగా కారు వెళ్లేందుకు అనువుగా లేకపోవడంతో ఆయన బైక్ నడిపి గ్రామానికి చేరుకున్నారు. 70 ఏళ్ల చరిత్రలో ఏ నాయకుడూ ఈ గ్రామాన్ని సందర్శించకపోవడం గమనార్హం. మంత్రి అక్కడి పరిస్థితి తెలుసుకుని తక్షణమే రూ.4లక్షలతో జాతీయ రహదారి మొగిలిపాడు నుంచి అడవికొత్తూరుకు 3 కిలోమీటర్లు గ్రావెల్‌రోడ్డు వేయాలని ఆదేశించారు. అనంతరం మరోవైపున కోసంగిపురం, అడవికొత్తూరు వీధులకు రూ.10లక్షలతో సీసీ రోడ్లు వేయాలని అధికారులకు ఆదేశించడంతో అడవికొత్తూరు గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

'అడవి'లో.. హారతులు

ఎలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 2వ వార్డులో సోమవారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. రాష్ట్ర పశుసంవర్థక, పాడి పరిశ్రమలు, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుపాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డులో ఉన్న అడవికొత్తూరు,కోసంగిపురం, నెమలి గ్రామం, నారాయణపురం గ్రామాల్లో మహిళలు ఆయనకు నుదుట కుంకుమ దిద్ది హారతులు పట్టారు.